ప్రజాశక్తి

ఆదివారం 28 సెప్టెంబర్ 2025   8 పేజీలు

గుంటూరు   పల్నాడు

కన్నీళ్లే జాషువా ఖడ్గాలు

జాషువా సాహిత్యాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి - జయంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

కులవివక్షత, మతతత్వం పెచ్చుమీరుతున్న తరుణంలో ప్రజల్లో సమానత్వ భావన, లౌకికతత్వ భావనలు పెంపొందించటానికి గుర్రం జాషువా సాహిత్యాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వక్తలు పిలుపునిచ్చారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని విజ్ఞాన కేంద్రంలో జాషువా 130వ జయంతి సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ విశ్లేషకులు, జర్నలిస్టు తెలకపల్లి రవికి జాషువా కవితా పురస్కారం అందచేశారు. సభలో తొలుత జాషువా విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీలు ఎంవిఎస్ శర్మ, కెఎస్ లక్ష్మణరావు పలువురు సాహితీవేత్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. అవార్డు గ్రహీత తెలకపల్లి రవి మాట్లాడుతూ తన సాహిత్య, రాజకీయ రచన ప్రారంభమైన గుంటూరులో జాషువా కవితా పురస్కారం అందుకోవటం ఆనందంగా ఉందన్నారు. వాస్తవికతలో నుంచి జాషువా సాహిత్య సృజన చేశారని, నేడు మన కళ్లముందున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలను గుర్తించి స్పందించాల్సిన బాధ్యత సాహితీవేత్తలు, అభ్యుదయ వాదులపై ఉందన్నారు. జాషువాను కుల వివక్షతను ఎంత బాధపెట్టినా 'బాకున కుమ్మినట్లాయనే' అని రాయటం ద్వారా సంస్కారవంతమైన పదజాలాన్ని ఉపయోగించారని, కానీ నేటి రాజకీయ నాయకులు తిట్లు, బూతులు లేకుండా మాట్లాడుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. భాషను సంస్కరించుకోవాటనికి జాషువా కవిత్వం నేడు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

గుర్రం జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ నేటి తరానికి రోజువారీ జీవితంలో నాది అని చెప్పుకోవటానికి సమయం లేకుండా పోతోందన్నారు. వర్క్‌ఫ్రం హోం పేరుతో 24 గంటలూ పనికి బానిసలుగా మారుతున్నామన్నారు. అరచేతిలోని ఫోన్ మన చైతన్యాన్ని నియంత్రిస్తోందని చెప్పారు. జాషువా స్ఫూర్తితో సంస్కృతిని, భాషను కాపాడుకోవటానికి, దానిని ముందు తరాలకు అందించటానికి కృషి చేయాలన్నారు. ఏసీ కాలేజి మాజీ ప్రిన్సిపాల్ పి.ముత్యం మాట్లాడుతూ వాస్తవాలను వాస్తవంగా ప్రజలకు వివరించే విశ్లేషకులు తెలకపల్లి రవి అని అన్నారు. జాషువా తెలుగు సాహిత్యంలో వెలుగులు విరజిమ్మాడని, కన్నీటిని ఖడ్గాలుగా మార్చాడని అన్నారు. తెలుగు భాషను పరిరక్షణలో ప్రభుత్వ కృషి ఉండాలన్నారు. జాషువా ఒక కులానికి పరిమితం కాదని, అందరి మనిషి అని చెప్పారు. జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలను, లక్ష్యాలను వివరించారు. 15 ఏళ్లుగా సాహిత్యంలో విశేష కృషి చేసిన పలువురుకి ఈ పురస్కారం అందచేశామని తెలిపారు. దీంతోపాటు విభిన్నమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ విజ్ఞాన కేంద్రం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలన్నారు. లౌకిక తత్వానికి పెను ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో జాషువా సాహిత్యాన్ని ▶ 2లో

కలెక్టరేట్ వద్ద నిరసనలో కార్మికులు

జొమాటో కార్మికుల సమ్మె ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

తమ సమస్యల పరిష్కారం కోసం జొమాటో కార్మికులు చేపట్టిన రెండ్రోజుల సమ్మె శనివారం ప్రారంభమైంది. సమ్మెలో భాగంగా కార్మికులు కలెక్టర్ ఆఫీస్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు బి.ముత్యాలరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కారం దిశగా జొమాటో యాజమాన్య ప్రతినిధులు ఆలోచించడం లేదని, శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మికులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. జూన్‌లో జరిగిన సమ్మె సందర్భంగా కార్మిక శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని అన్నారు. ఏడాది మొత్తం రూ.375 ఇన్సెంటీవ్ ఇస్తామని, పే ఔట్ తగ్గించబోమని, 3 ఆర్డర్స్ శ్లాబ్‌లు కొనసాగిస్తామని చెప్పి 45 రోజుల తరువాత ఇన్సెంటీవ్‌ను క్రమంగా రూ.175కు తగ్గించారని, పే ఔట్ కూడా తగ్గించారని, ఆర్డర్స్ శ్లాబ్‌లు 3కు బదులు 2 మాత్రమే పెట్టారని వివరించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టులో జిల్లా కలెక్టర్‌కు విన్నవించామని, ▶ 2లో

రాజధానిలో క్వారీల ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం అనంతవరంలో క్వారీల ఏర్పాటుపై శనివారం ప్రజాభిప్రాయ సేకరణ కోసం సదస్సు నిర్వహించారు. కాలుష్యం, పర్యావరణ సంబంధిత సదస్సులో పాల్గొన్న గ్రామస్తులలో పలువురు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణాల్లో కంకర, మెటల్ తవ్వకాలతో సరిపెట్టకుండా ▶ 2లో

సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

శాసన సభలో గళమిప్పిన జిల్లా ఎమ్మెల్యేలు 2 లో





కన్నీళ్లే జాషువా ఖడ్గాలు

(మొదటి పేజీ తరువాయి)

విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం తెలకపల్లి రవికి జాషువా కవితా పురస్కారం అందించి సత్కరించారు. జాషువా పద్యాల పోటీ విజేతలు సీనియర్స్ వై.చంద్రపాల్, జి.వెంకటేశ్వర్లు, జె.బాబురావుకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. జూనియర్స్‌లో ఎ.స్వరాజ్యలక్ష్మి, వై.వికసిత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ' జాషువా..జాషువా..దళిత జ్వలిత భాషువా, చైతన్య ఘోషవా ' అంటూ తెలకపల్లి రాసిన పాటను ప్రజాగాయకుడు పి.వి.రమణ ఆలపించాడు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, జనచైతన్య వేదిక అధ్యక్షులు లక్ష్మణరెడ్డి, జాషువా విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎన్.కాళిదాసు, కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ ఎన్.భావన్నారాయణ పాల్గొన్నారు.

రాజధానిలో క్వారీల ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ

(మొదటి పేజీ తరువాయి)

గ్రామం అభివృద్ధికి, స్థానికులకు ఉపాధి కల్పించడం లాంటి చర్యలు తీసుకోవాలని కోరారు. డిఆర్‌ఒ షేక్ ఖాజ వలి మాట్లాడుతూ క్వారీల ఏర్పాటుపై వ్యక్తమైన అభిప్రాయాలను కాలుష్య నియంత్రణ మండలికి నివేదిస్తామని, మండలి నిర్ణయం మేరకు తదుపరి చర్యలుంటాయని చెప్పారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారి నజీనా బేగం, తహశీల్దార్ హరిబాబు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సదస్సు...

సదస్సును మొక్కుబడిగా నిర్వహించారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సదస్సు నిర్వహణ గురించి పెద్దగా ప్రచారం చేయలేదని, దీంతో కొద్ది మందే హాజరుకాగలిగారని చెబుతున్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే వాట్సప్ నంబర్

ప్రజాశక్తి - ఫిరంగిపురం

నియోజకవర్గంలోని ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజల వ్యక్తిగత సమస్యలు, గ్రామ సమస్యలు, ప్రభుత్వ పథకాలు, మౌలిక వసతులు, రోడ్లు, తాగునీరు, విద్యుత్, ఆరోగ్య సేవలు వంటి ఏ సమస్య అయినా నేరుగా తమకు చేరేందుకు అవకాశం కల్పిస్తూ 9959659059 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం పంపాలని సూచించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలపై అధికారులను పంపించి సత్వరం పరిష్కరిస్తామన్నారు. ప్రజల సమస్య పరిష్కారమే తన తొలి ప్రాధాన్యమని, ఎవరైనా సమస్యలను తన దృష్టికి తేచ్చి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు పోస్టర్లను నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో ఏర్పాటు చేయించారు.

కార్మికులను దోచిపెడుతున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పెట్టుబడిదారీ వ్యవస్థల చేతిలో కార్మికుల శ్రమ దోపిడీని పెడుతున్నాయని, కార్మికులు బలిదానాలు చేసి సాధించుకున్న హక్కులను హరించే విధంగా 13 గంటల పని దినాన్ని తెచ్చాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ విమర్శించారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారం చేపట్టాక అన్ని వ్యవస్థలను ఛిన్నభిన్నం చేస్తున్నారని, ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేశారని అన్నారు. కేంద్రం చేస్తున్న దగాకోరు విధానాలకు రాష్ట్ర ప్రభుత్వమూ వంతపాడుతోందని, పనిగంటల పెంపు అందులో భాగమని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నాయకులు కె.కాశయ్య, ఎ.ప్రభాకర్, జె.జాన్‌బాబు, ఎన్.బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

శాసన సభలో గళమిప్పిన ఎమ్మెల్యేలు

వీక్షణం

శాసన సభ, శాసన మండలి సమావేశాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు తమ వాణి వినిపించారు. పలు ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించారు. సభకు హాజరైన ఎమ్మెల్యేలు అందరూ చర్చల్లో పాల్గొన్నారు. మసీదుల అభివృద్ధికి నిధులిప్పించాలని, తెలంగాణ నుంచి రావాల్సిన రూ.63 కోట్లు వక్ఫ్ బోర్డు నిధులు ఇప్పించాలని ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ కోరారు. మసీదులు నిర్మాణానికి, మరమ్మతులకు, కబరస్తాన్ల అభివృద్ధి వక్ఫ్ బోర్డు ద్వారా రివాల్వింగ్ ఫండ్ ఇప్పించాలని కోరారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో ఆరోగ్యశ్రీ బకాయిలను ప్రస్తావించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాథమిక పాఠశాలల విలీనంపై నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు ప్రస్తావించారు. ఆ పాఠశాలలను పునరుద్ధరించాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాలపై ఉక్కుపాదం మోపాలనీ ఎమ్మెల్యే గల్లా మాధవి కోరారు. పర్యావరణం, ప్రజారోగ్యం రెండింటికీ ఇది తీవ్రమైన ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరులోనే రోజుకు సుమారు 17 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. గుంటూరులో ఒక్కసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అసెంబ్లీలో మహిళా సాధికారత అమలు కోసం మరిన్ని సదస్సులు నిర్వహించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో పొగాకు నిలవాలని వెంటనే కొనుగోలు చేయాలని చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు కోరారు. తాడికొండ నియోజకవర్గంలో రహదారుల ద్వారా ఉన్నాయని వెంటనే మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ కోరారు. గుంటూరు నుంచి రాజధానికి వెళ్లే రోడ్లన్నీ దెబ్బ తిన్నాయనీ చెప్పారు. రాజధానిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా టిప్పర్లు ఎక్కువగా తిరగటం వల్ల రోడ్లు బాగా దెబ్బతిన్నాయన్నారు. చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, యరపతినేని శ్రీనివాసరావు, భాష్యం ప్రవీణ్ తదితరులు పలు అంశాలు ప్రస్తావించారు. శాసనమండలిలో చీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ,ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, కల్పలత, అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్ తదితరులు జిల్లాకు సంబంధించి కొన్ని అంశాలను ప్రస్తావించారు. పేరేచర్ల లేఔట్ లో జగనన్న కాలనీలో విద్యుత్ పరికరాలు మాయంపై చంద్రగిరి ఏసురత్నం ఫిర్యాదు చేశారు. ఈ పరికరాలను విద్యుత్ అధికారులు తీసుకువెళ్లారా? లేదా దొంగతనం జరిగిందా? అనే విషయంపై ప్రభుత్వం విచారణ చేయాలన్నారు. చేనేత కార్మికులకు రా మెటీరియల్‌పై జీఎస్టీ తగ్గించాలని మురుగుడు హనుమంతరావు కోరారు.

ఎవిడి శర్మ

జొమాటో కార్మికుల సమ్మె ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

కార్మికశాఖ అధికారుల వద్ద జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తే అక్కడ కూడా యాజమాన్య ప్రతినిధులు మొండిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ పరిస్థితులన్నింటి నేపథ్యంలో సమ్మె అనివార్యమైందని తెలిపారు. ఇప్పటికే విశాఖపట్నంలో జొమాటో, ఇతర సంస్థల గిగ్ వర్కర్స్ గత 3 వారాలుగా శని, ఆదివారాలు సమ్మె చేస్తున్నారని, సమస్యలు పరిష్కరించకుంటే ఇది రాష్ట్రవ్యాప్తమవుతుందని హెచ్చరించారు. యూనియన్ కార్యదర్శి ఇ.క్రాంతిరణదేవ్ మాట్లాడుతూ కార్మికశాఖ వద్ద సంస్థ ప్రతినిధులు ఇచ్చిన హామీకి భిన్నంగా వ్యవహరించి కార్మికులను మోసం చేశారన్నారు. పెరిగిన పెట్రోల్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వెలిబుచ్చారు. కనీసమైన ఆదాయం వచ్చేలాగా, కనీస వేతన చట్టాలు వర్తింపజేసేలాగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని టీమ్ లీడర్‌ను కార్మికులు కోరితే ఐ.డి బ్లాక్ చేస్తామంటూ బెదిరిస్తున్నారని, భౌతిక దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. గిగ్ కార్మికులకు భద్రత కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్‌కు వినతిపత్రం అందచేశారు. జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ కార్మికశాఖ అధికారుతో మాట్లాడి వివరాలు తెలుసుకొని, 2 వారాల్లో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, వెంకట్, వాల్మీకి, బ్యెసాని నాగేశ్వరరావు, శివ, షేక్ అబ్దుల్లా, ఇజ్రాయిల్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు టిడిపి మండలాధ్యక్షుని ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - పెదనందిపాడు

టిడిపి పెదనందిపాడు మండలం నూతన అధ్యక్షులుగా నియమితులైన కోడూరి రఘురామయ్య (రాంబాబు) ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం జరుగుతుందని ఆ పార్టీ పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షులు జె.హనుమంతరావు శనివారం తెలిపారు. నాగులపాడు ఉప మార్కెట్ యార్డులో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, పరిశీలకురాలు వందనాదేవి, జనసేన నాయకులు కె.నాగేశ్వరరావు, బిజెపి నాయకులు శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు. మండలంలోని టిడిపి శ్రేణులు భారీ సంఖ్యలో ప్రమాణ స్వీకారానికి హాజరవ్వాలని కోరారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

- రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- ఓపీలో 10 శాతం జ్వర పీడితులే

ప్రజాశక్తి - మాచర్ల

ఇటీవల భారీ వర్షాలు, వాతావరణ మార్పులతో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇంటిల్లపాది జ్వరాల బారినపడి బాధపడుతున్నారు. మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. రోగుల సంఖ్య రోజురోజుకూ గణనీయంగా పెరుగుతోంది. స్థానిక ప్రభుత్వాస్పత్రికి రోజూ ఓపీ 400 వరకు ఉంటుంది. వీరిలో 40 మంది (10 శాతం) వరకు జ్వరపీడితులు ఉంటున్నారు. గతంలో ఇది ఇద్దరు ముగ్గురుగానే ఉంది. జ్వరం, తలనొప్పి, దగ్గు, జలుబు, నీరసం, ఒళ్లు నొప్పులు, గొంతునొప్పి లక్షణాలతో ఎక్కువమంది ఆసుపత్రులకు వస్తుండగా వీరిలో వైరల్ ఫివర్ లక్షణాలు అధికంగా, కొద్దిమోతాదులో టైఫాయిడ్ సోకిన వారుంటున్నారు. వచ్చిన జ్వరాలు తేలిగ్గా తగ్గటం లేదు. తప్పనిసరిగా ఆసుపత్రుల్లో చేరాల్సి వస్తోంది. మూడ్రోజులైనా ఆస్పత్రుల్లో చికిత్స పొందితేనే తర్వాత జ్వరాలు తగ్గుతున్నాయి. జ్వరం తగ్గినా తలనొప్పి జలుబు, దగ్గు, నీరసం మాత్రం వారం రోజు పాటు తగ్గడం లేదని రోగులు చెబుతున్నారు.

కుటుంబంలో ఒకరు తర్వాత మరొకరు ఈ విషజ్వరాలతో అల్లాడిపోతున్నారు. తమ కుటుంబంలో ఐదుగురికి జ్వర రావడంతో వైద్యం కోసం రూ.15 వేలు ఖర్చయిందని, నెల సంపాదన మొత్తం వైద్యానికే సరిపోయిందని మాచర్లకు చెందిన ప్రైవేటు చిరుద్యోగి జొరిగే రామబ్రహ్మయ్య వాపోయాడు. పేదలు ఈ ఖర్చు తట్టుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు అందిస్తున్నా ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరే వారు ఎక్కువగా వుంటున్నారు. పేదలు అధికంగా ఉండే ఈప్రాంతం వారు, ఏదైన ఆరోగ్య సమస్య వస్తే... తాము పెంచుకుంటున్న జీవాలను అమ్ముకోవాల్సి వస్తోంది. చిన్న పిల్లల నుండి మొదలుకొని పెద్ద వయసు వారు కూడా విష జ్వరాలతో వణికిపోతున్నారు.

జ్వరాలు అదుపులోనే ఉన్నాయి

డాక్టర్ కెపి.చారి, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్

జ్వరాలు అదుపులోనే ఉన్నాయి. డెంగ్యూ, మలేరియా జ్వరాలు లేవు. ఎక్కువగా వైరల్ ఫివర్ కేసులే వస్తున్నాయి. ఆసుపత్రుకు వచ్చిన వారికి రెండుమూడ్రోజుల్లో చికిత్స అందించి డిశ్చార్జి చేస్తున్నాం. సీరియస్ కేసులు నమోదు కాలేదు. రకరకాల జ్వరాలకు కారణం దోమలు కాబట్టి వాటికి గురవకుండా దోమతెరలను ఉపయోగించుకోవాలి. చుట్టూ పరిసర ప్రాంతాలు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. పాతట్యూబులు, కుండల్లో నీరు నిల్వలేకుండా చూడాలి. ఈ సమయంలో కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందాలి.

దోమకాటు, అపరిశుభ్రత, కలుషిత నీరు తాగటం వలన జ్వరాలు బారిన పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇటీవల వర్షాలకు చెరువులు, కుంటలు నీటితో నిండాయి. వాటిల్లో దోమలు వ్యాప్తి ఎక్కువుగా ఉంది. భూగర్భజలాల్లో కలుషిత నీరు ఇంకి తాగునీరు కులుషితం అవుతున్నాయి. మాచర్ల పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఎక్కువుగా వాటర్ ప్లాంట్ల నుండి కొనుగోలు చేసిన నీటినే స్థానికులు తాగుతుంటారు. అయితే వీధికొకటి అన్నట్లు తయారైన వాటర్ ప్లాంట్ల పనితీరు, నిర్వహణ ఎలా వుందో, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాయో లేదో తెలియని పరిస్థితి. సంబంధిత అధికారులు వాటిని తనిఖీలు చేస్తున్నట్లు ఎక్కడా కనపడటం లేదు.

వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మద్యపానంతో అనారోగ్యం

ప్రజాశక్తి-ఈపూరు

మద్యపానం చేసేవారు అనారోగ్యం బారినపడటమే కాకుండా కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతాయని ఎక్సైజ్ సీఐ డి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కొండ్రముట్ల గ్రామంలో శనివారం కేర్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. మద్యపానం వలన కలిగే దుష్ఫలితాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నాటు సారాయి, గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సంబంధిత నేరాలపై సమాచారం స్థానిక పోలీసులకు తెలియజేయాలన్నారు. అనంతరం విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు.

జిఎస్టీపై ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

జీఎస్‌టీ 2.0 పై గ్రామ స్థాయిలో ఇంటింటికీ తిరిగి ప్రజలందరికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంపై ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం ప్రత్యేక సమావేశం జరిగింది. జీఎస్‌టీ ఆఫీసర్ నల్లపాటి శ్రీనివాస్, సహాయక కమిషనర్ కె.కేథారేశ్వరరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సీహెచ్ కళ్యాణ్‌కుమార్, ఇన్‌ఛార్జి ఎంపిడిఓ కె.రవి బాబు పలుఅంశాలపై వివరించారు.

కార్యక్రమంలో మాట్లాడుతునన డాక్టర్ ఊర్మిళ

పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి - చేబ్రోలు

క్షయతో బాధపడుతున్న 25 మందికి నెల రోజులకు సరిపడా పౌష్టికాహారం అందించినట్లు చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ యు.ఊర్మిళ తెలిపారు. విజ్ఞాన్ ఫార్మసీ కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రాజ్యలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా వీటిని సమకూర్చగా ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన స్వస్థనారి సశక్తి కార్యక్రమంలో పంపిణీ చేశామన్నారు. సంగీతరావు, కృష్ణమోహన్, చాందిని, కె.మురళి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న రాజేంద్రప్రసాద్

క్షతగాత్రునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక సుందరయ్యనగర్ కాలనీలో ఇటీవల కరెంట్ షాక్ తగిలి ప్రమాదానికి గురైన బ్లెస్సింగ్ పాల్ కుటుంబానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ చెయూతనిచ్చారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకుడు కోగంటి రోహిత్ చేతులమీదుగా రూ.30 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మహమ్మద్ కుదూస్, నాయకులు పి.త్రిమూర్తి, టి.ప్రసాద్, ఎం.విజయ్, ఎ.రమేష్ పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడు మృతి

ప్రజాశక్తి - కారంపూడి

సరదాగా ఈతకు వెళ్లిన ముగ్గురిలో ఒక్కరు మృతి చెందిన ఘటన కారంపూడిలో శనివారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పదవ తరగతి చదువుతున్న నరసరావుపేటకు చెందిన ముగ్గురు యువకులు దసరా సెలవులు నిమిత్తం కారంపూడికి చెందిన జాహీరా అనే వారి పెద్దమ్మ ఇంటికి పండుగకు వచ్చారు. శనివారం ఉదయం బట్టలు ఉతుక్కునేందుకు స్థానిక వినుకొండ రోడ్డులోనిపెద్ద కాలువకు పెద్దమ్మతో కలసి ఖాదర్‌వలీ, నాగూర్ మీరా, సయ్యద్ సత్తార్ వెళ్లారు. సాగర్ కుడి కాలవలో ఈత కొడుతూ ముగ్గురు మునిగిపోవడంతో అక్కడ ఉన్న వారు పెద్దగా కేకలు వేయటంతో స్థానికులు గమనించి మునిగిపోతున్న వారిలో ఇద్దరిని కాపాడారు. సయ్యద్ సత్తార్ అనే యువకుడు గల్లంత య్యాడు. విషయం తెలుసు కున్న స్థానిక పోలీసులు గజ ఈతగాళ్లని పిలిపించారు. వారు కాల్వలో గాలించి సయ్యద్ సత్తార్‌ను బయ టకు తెచ్చారు. అప్పటికే సత్తార్ మృతి చెందాడని కనుగొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కారంపూడి ఎస్సై వాసు గురజాల ప్రభుత్వా సుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పచెప్పారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

సయ్యద్ సత్తార్ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చుతున్న ఈతగాళ్లు

కూటమిలో చిచ్చుపెట్టాలని వైసిపి నేతల ప్రయత్నం : టిడిపి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సూపర్-6 పథకాలు అమలు చేయడంతో ఓర్వలేని వైసిపి నేతలు చిచ్చు పెట్టాలని చూస్తున్నారని పల్నాడు జిల్లా తెలుగు యువత నాయకులు గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మద్యం సేవించి అసెంబ్లీకి వచ్చాడని, అసెంబ్లీలో వద్ద బ్రీత్ అనలైజర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వైసిపి పల్నాడు జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడడం తగదన్నారు. హుందా రాజకీయాలకు నందమూరి, నారా కుటుంబం పెట్టింది పేరన్నారు. గతంలో డాక్టర్ కోడెల శివ ప్రసాదరావుపైనా అనవసర ఆరోపణలు చేశారన్నారు. సైకో పోవాలి సైకిల్ రావా లని ప్రజలు నినదించి టిడిపి కూటమికి అధికారం కట్టబెట్టారని ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే బాలకృష్ణ అలా మాట్లాడుతూ సినీ పరిశ్రమ కు జరిగిన అవమానం గుర్తు చేశారన్నారు. వైసిపి హయాంలో అసెంబ్లీలో మాట్లాడిన మాటల కంటే ఘోరమైన వ్యాఖ్యలు కాదన్నారు. వైసిపి చేస్తున్న దుష్ప్ర తచారాన్ని టిడిపి కూటమి ఖండిస్తోందన్నారు. వైసిపి ఎన్ని కుయుక్తులు పన్నినా టిడిపి కూటమి పొత్తు మరింత బలపడటం ఖాయమన్నారు.

గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి

సురేష్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పాస్టర్లు

సురేష్‌కుమార్‌కు పాస్టర్ల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - చేబ్రోలు

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, హార్వెస్ట్ ఇండియా అధినేత కత్తెర సురేష్ కుమార్ పుట్టినరోజు వేడుకలను స్థానిక పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వేజెండ్లలోని హార్వెస్ట్ ఇండియా విద్యా సంస్థ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సురేష్ కుమార్‌ను పాస్టర్లు సన్మానించారు. పేద విద్యార్థులకు, వృద్ధులకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు.

శిష్య బబుందంతో నృత్య గురువు వెంకటలక్ష్మి

నందివెలుగులో విజయదశమి ఉత్సవాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మండల పరిధి నందివెలుగు గ్రామంలోని శ్రీ కనకదుర్గాదేవి దేవస్థానంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో శ్రీ లక్ష్మి కూచిపూడి నృత్య కళాకేంద్రం విద్యార్థినులు శనివారం ప్రదర్శించిన కూచిపూడినృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని నృత్య గురువు ఎ.వెంకటలక్ష్మి పర్యవేక్షించారు.

రాజధాని రైతులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - తాడికొండ

అమరావతి రాజధాని పరిసర ప్రాంత గ్రామీణ రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఆంధ్ర రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు నిడుముక్కల గ్రామంలో చేస్తున్న నిరాహార దీక్ష శనివారానికి 90వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం రాజధాని అవసరం ఏర్పడిన సందర్భంగా గత టిడిపి ప్రభుత్వం తుళ్లూరు పరిసరాలలో రాజధానిని ఏర్పాటు చేయగా వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మూడు రాజధానులను తెర మీదకి తెచ్చిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాజధానిలో పనులు ప్రారంభించిందని, దీనితో రాజధాని చుట్టుపక్కల గ్రామాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించిందని అన్నారు. టిడిపి ప్రభుత్వ అసమర్థ నిర్ణయాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైందని విమర్శించారు. రైతుల అభిప్రాయాలను పరిగణలకు తీసుకొని భూ సమీకరణకు దిగాలని విజ్ఞప్తి చేశారు.

నిరసన దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న కోటేశ్వరరావు

In The Court of The Hon'ble Principal Civil Judge (Junior Division) Narasaraopet
OS No; 22/2024

Between;
పరుచూరి సాంబశివరావు ...వాది
And
1) కొత్తూరి శతఘ్నుడు
2) కొత్తూరి లక్ష్మణరావు
3) మురికిపూడి శేష పద్మజ D/o పూర్ణచంద్రరావు, హిందువు, వయసు 43 సంవత్సరాలు, R/o కృష్ణ నగర్, గుంటూరు టౌన్ & జిల్లా. ...ప్రతివాదులు

పై నెంబరు దావాలో 3వ ప్రతి వాదికి శ్రీ పైకోర్టు వారి నుండి అనేక పర్యాయములు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనని కారణంగా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ యొక్క సమన్లు నిమిత్తం ది. 15-10-2025 కు వాయిదా అయి ఉన్నది. కావున సదరు వాయిదా తేదిన ఉదయం 10-30 గం.ని లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా ది.15-10-2025

ఇట్లు
కె.బుచ్చిదంతా చారి,
వాది తరపు న్యాయవాది,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.

తుళ్లూరులో కోతుల బెడద

ప్రజాశక్తి - తుళ్లూరు

మండల కేంద్రమైన తుళ్లూరులో కోతుల బెడద ఎక్కువైంది. ఇళ్లలోకి ప్రవేశించి ఆహార పదార్థాలను,వంట సామగ్రిని చిందర వందర చేస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఏమరు పాటుగా ఉంటే మీదకి దుమికి గాయపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం సినిమా హాలు సెంటర్లో బళ్లపై కూర్చున్న ఓ వ్యక్తిపై కోతి ఎగబడి దాడి చేసి చేతిపై కరిచింది. దీంతో స్థానికులు క్షతగాత్రుడిని స్థానిక ప్రాథమిక వైద్యశాలకు తీసుకెళ్ళి చికిత్స చేయించారు.కోతులు గతంలో కష్ణానదీ తీర ప్రాంతంలో ఎక్కువగా సంచరించేవి. నదీ పరీవాహక ప్రాంతంలో జామ తోటలు, తాటికాయలు, కొబ్బరి, కంద, అరటి, మొక్కజొన్న, కూరగాయలు ఎక్కువగా పండేవి. రాజధాని నిర్మాణం నేపథ్యంలో పంటల సాగు లేకుండా పోవడంతో కోతులు గ్రామాల్లోకి ప్రవేశించాయి. వీటి ఆగడాలు రోజు రోజుకు ఎక్కువవుతున్నాయని, అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

In The Court of The Hon'ble Principal Civil Judge (Junior Division) Narasaraopet
I A No; 52/2024 IN Os No; 22/2024

Between;
పరుచూరి సాంబశివరావు ... Petitioner/Plaintiff
And
1) కొత్తూరి శతఘ్నుడు
2) కొత్తూరి లక్ష్మణరావు
3) మురికిపూడి శేష పద్మజ D/o పూర్ణచంద్రరావు, హిందువు, వయసు 43 సంవత్సరాలు, R/o కృష్ణ నగర్, గుంటూరు టౌన్ & జిల్లా.
... Respondants/Defendants

పై నెంబరు I.A. 52/2024 లో 3వ రెస్పాండెంటుకు శ్రీ పైకోర్టు వారి నుండి అనేక పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకొనని కారణంగా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ నోటీసు నిమిత్తం ది. 15-10-2025కు వాయిదా అయి ఉన్నది. కావున సదరు వాయిదా తేదిన ఉదయం 10-30 గం.ని లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా ది.15-10-2025

ఇట్లు
కె.బుచ్చిదంతా చారి,
పిటీషనర్ తరపు న్యాయవాది,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో..
CREDITOR I.P. No.9/2025

దుడ్డుపూడి శశికుమారి ... పిటీషనర్/క్రెడిటార్
వర్సెస్
యలవర్తి అలివేలు @అలివేలు మంగమ్మ & 4 అదర్స్
.... రెస్పాండెంట్స్ / డెబ్‌టార్స్

టు :
1వ రెస్పాండెంట్/డెబ్‌టార్ :
యలవర్తి అలివేలు @ అలివేలు మంగమ్మ,
భర్త : గోపిచంద్, డోర్ నెం. 20-5-2ఏ,
రామలింగేశ్వరపేట, తెనాలి, గుంటూరు జిల్లా.
2వ రెస్పాండెంట్/డెబ్‌టార్ :
యలవర్తి పూర్ణకుమారి, భర్త: వెంకట కృష్ణ ప్రసాదు (లేటు), డోర్ నెం. 20-5-2ఏ, రామలింగేశ్వరపేట, తెనాలి, గుంటూరు జిల్లా.
3వ రెస్పాండెంట్/డెబ్‌టార్ :
యలవర్తి లక్ష్మీసుధ, తండ్రి : వెంకట కృష్ణ ప్రసాదు (లేటు), డోర్ నెం. 20-5-2ఏ, రామలింగేశ్వరపేట, తెనాలి, గుంటూరు జిల్లా.

పై నెంబరు కలిగిన క్రెడిటార్ ఐ.పి.లోని 1 నుండి 3 రెస్పాండెంట్లు, డెబ్‌టార్స్ అయిన మీకు అనేక పర్యాయములు శ్రీ కోర్టు ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్న కారణముగా శ్రీ కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసులు పంపమని ఆర్డరు వేస్తూ ది. 8-10-2025కి వాయిదా వేసి వున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని లేక మీ తరపు న్యాయవాది ద్వారా గానీ కోర్టుకు హాజరై మీ అక్షేపణలను తెలుపు కొనవలెను. లేనియెడల పై నెంబరు క్రెడిటార్ ఐ.పి.ని మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనవి.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 8-10-2025

తాడిబోయిన శ్రీనివాసరావు,
పిటీషనరు/క్రెడిటార్ తరపు న్యాయవాది,
తెనాలి. సెల్ : 9848363744

త్రిబుల్ ఐటీకి ఎంపికైన ఆలేటి కార్తీక్

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

స్పోర్ట్స్ కోటాలో త్రిబుల్ ఐటీ సీటుకు మాచర్ల సెయింటాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి ఆలేటి కార్తీక్ నూజి వీడు త్రిబుల్ ఐటీ కాలేజీకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ సుజాత కార్తీక్‌ను పూల బొకేతో ప్రత్యేకంగా అభినందించారు. సిస్టర్ సుజాత మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, తల్లిదండ్రులకు, స్కూళ్లకు, మాచర్ల పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సిస్టర్ శ్వేత, పిఈటి కుమార్, సెంటెన్స్ స్కూల్ సీనియర్ రికార్డ్ అసిస్టెంట్ ఎం.నాగేశ్వరరావు, విద్యార్థులు కార్తీక్‌కు అభినందనలు తెలిపారు.

కార్తీక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుజాత

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

జిఎస్టీ 2.0పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని మున్సిపల్ కార్యలయంలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న జిఎస్టీ తగ్గింపుపై మహిళలు, వ్యాపారులు, సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మున్సిపల్ ఛైర్మన్ సుబ్బారావు హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు, పిడుగురాళ్ళ సేల్స్‌ట్యాక్స్ అసిస్టెంట్ కమి షనర్ పి.నారాయణ శాస్త్రి మాట్లాడుతూ జిఎస్టీ 2.0 మార్పులు, పన్ను తగ్గింపులు గురించి వివరించారు. పాలు, మందులు, విద్యా సామగ్రి, వ్యవసాయ పనిముట్లు వంటి వాటిపై జిఎస్టీ తగ్గించబడిందని అన్నారు. వ్యాపారులు తమ దుకాణాల్లో జిఎస్టీ 2.0కు ముందు తరువాత ధరల మార్పులను తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జిఎస్టీ అధికారి టి.పీటర్ బాబు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సి. రామకృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జాతీయ స్థాయి పోటీలకు 'వాగ్దేవి' విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నకరికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 25, 26 తేదీలలో అంతర జిల్లాల ఆట్యా-పాట్యా సీనియర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆటల పోటీలలో పల్నాడు జిల్లా తరపున గొప్ప ప్రతిభ కనబరచి తమ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని వాగ్దేవి కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు శనివారం తెలిపారు. బాలికల విభాగంలో ప్రతిభ చాటిన పసుపులేటి తిరుపతమ్మ పిన్నెబోయిన స్రవంతి, బోరుగడ్డ సౌజన్య, షేక్ నజ్మా బాలుర విభాగంలో కాసా శ్రీనివాసరావు, ధనవరపు త్రినాథ్ ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వచ్చే నెల 8,9,10 తేదీలలో కర్ణాటక రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో ఆంధ్రరాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. జాతీయ స్థాయి పోటీలలో కూడా ప్రతిభ చాటి రాష్ట్రానికి పల్నాడు జిల్లాకు కళాశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను కళాశాల ప్రిన్సి పాల్ ఓగూరి నాగేశ్వరరావు, డైరక్టర్లు కాట్ల రామ కోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కష్ణారావు, పివి అచ్యుతరావు, పిడి రాయల ఆంజనేయులు అభినందించారు.

గుంతలమయమైన రోడ్లు

ప్రమాదాలు జరిగినా స్పందించని అధికారులు

మరమ్మతుకు నోచని రోడ్లు, సిగ్నల్స్

నరసరావుపేట సెంటర్లో నరసరావుపేట పోవు రహదారి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అసలే వర్షాకాలం. రోడ్లన్నీ గుంతల మాయం. గుంతల్లో నీరు ఎంతలోతులో ఉన్నాయో అర్ధం కాని పరిస్థితి. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునేవారు లేరు. ఎన్ఆర్‌టి సెంటర్ నుంచి నరసరావు పేట వైపు వెళ్లే రాష్ట్ర రహదారి 20 కి.మీ. పొడవునా రోడ్డు కిరు వైపుల పెద్ద పెద్ద(సైడ్ బరమ్స్) గోతులు పడ్డాయి. దీంతో ప్రతి నెల పదుల సంఖ్యలో క్షత గాత్రులు, ఒకరిద్దరు మృతి చెందటమే కాక రూ.లక్షల్లో వాహనాలు ధ్వంసమౌతున్నాయి. మృతి

టిడ్కో ఇళ్లకు వెళ్లే మార్గంలోని భావన రుషినగర్‌లో

చెందిన, క్షతగాత్రుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులు చిన్నాభిన్నమౌతున్నాయి. గతంలో రోడ్ల ప్రమాదాలు జరిగితే వెంటనే స్పందించి తాత్కాలిక రిపేర్లుచేసి రెండు మూడు రోజులు హడావుడి చేసే అధికార్లు ప్రస్తుతానికి ప్రమాదాలు జరిగి మరణించినా స్పదించటం లేదని వాహనచోదకులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలో ప్రజలకు అడ్డరోడ్డు, విజయ బ్యాంక్, ఎన్ఆర్‌టి సెంటర్ నుంచి నరసరావుపేట వరకు, పండరీపురం నుంచి టిడ్కో ఇళ్లకు పోయే దారిలో సింగ్‌నగర్‌లో సిమెంట్ రోడ్లు బద్దలుగా పగిలిపోవడం వల్ల మోటార్ సైకిల్ టైర్లు అందులో ఇరు క్కుని రోజుకి ఒకరిద్దరైన ప్రమాదానికి గురవుతోన్నారు. కళామందిర్ సెంటర్ నుంచి శారదా హైస్కూలు వైపు వెళ్లే రోడ్డు కూడా ప్రమాద భరితంగా తయారైంది. అడ్డరోడ్డు వద్ద చీరాల బస్సులు ఆగు స్థలం వద్ద కళామందిర్ సెంటర్ వద్ద రోడ్లకు ప్యాచ్ వర్క్ చేయక పోవడంతో గుంతలు ఏర్పడి ప్రమాద భరితంగా తయారయ్యాయి. రోడ్లపై ప్రయాణం కష్టతరంగా మారింది. రోజూ ప్రజలు, విద్యార్థులు, ఇతర పనుల పై వచ్చి, పోయో వారి వాహనాలతో రద్దీ పెరిగింది.

ఇరుక్కుప అదే మాదిరి అడ్డ రోడ్డు నుంచి కోటప్ప కొండకు పోయే రహదారిలో పోతవరం వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి ఒంగోలు బ్రిడ్జివద్ద నుంచి ఏఎంజి

చీరాల రోడ్డు పక్కన చాణిక్య స్కూల్ ఎదురు రోడ్డు

వరకు జాతీయ రహదారిలో సైతం అక్కడక్కడ గోతులు ఏర్పడ్డాయి. మృతి చెందితే సంతాపాలు తెలిపే నాయకులు స్పందించి ప్రమాదాల నివారణకి అధికారులతో కలసి చర్యలు తీసుకోవాలని మృతుల కుటుంబ సభ్యులు కోరుతున్నారు. వాహన తనిఖీ, ఆర్ అండ్‌బి అధికారులు, పోలీస్ శాఖాధికారులు, మున్సిపల్ అధికారులు, రోడ్లు భవనాల శాఖ ఉద్యోగులు స్పందించి రోడ్లకు మరమ్మత్తులు చేయిచి, ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు,. వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కళామందిర్ సెంటర్ నుంచి చీరాలకు వెళ్లే రహదారి

సూపర్ జిఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించండి

టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సూపర్ జిఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ కతిక శుక్లా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సూపర్ జిఎస్టీ-సూపర్ సేవింగ్స్, గ్రామాలు, స్వచ్ఛతా హీ సేవ పై ఆయా శాఖల జిల్లా అధికారులు, ఎంపిడిఓలు, ఇతర అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 22వ తేదీ నుంచి అమలు చేస్తున్న జిఎస్టీ 2.0 సంస్కరణలు ప్రజలకు ఎంత మేర లాభం చేకూరుస్తున్నాయో అక్టోబర్ 19 వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జీఎస్టీ క్యాంపెయిన్‌కు జిల్లానోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్ ఉంటారన్నారు. మండల, మున్సిపల్ స్థాయిలో ఇతర శాఖల అధికారులతో కమర్షియల్ టాక్స్ అధికారులు సమన్వయం చేసుకోవాలని తెలిపారు. జీఎస్టీపై మున్సిపల్ కమిషనర్, ఎంపిడిఓ సమన్వయంతో రోజువారీ ప్రత్యేక బృందాలతో అన్ని వర్గాల ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమాల నిర్వహణకు కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జీఎస్టీ అవగాహన కార్యక్రమాలపై జాయింట్ కలెక్టర్ పర్యవేక్షిస్తారన్నారు.

నాగార్జునసాగర్‌కు విడుదల చేసిన వరద నీరు

సాగర్ నుండి కొనసాగుతున్న నీటి విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరదనీటి చేరిక కొనసాగుతోంది. దీంతో సాగర్లో శనివారం 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. 26 క్రస్ట్ గేట్లు 10 అడుగుల మేర ఎత్తి 3,76,402 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 4,19,598 క్యూసెక్కులు వచ్చి చేరటంతో ఇక్కడ నుంచి మొత్తం ఔటుగా 4,19,598 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఇక్కడ నుంచి కుడికాలువకు 8,023, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 33,373, ఎస్ఎల్బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రసతం సాగర్ జలాశయ నీటిమట్టం 587.30 అడుగులు కాగా ఇది 305.6838 టీఎంసీలకు సమానం.

వైసిపి శ్రేణులకు భరోసా డిజిటల్ బుక్ యాప్

పోస్టరును ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టిడిపి కూటమి ప్రభుత్వంలో అధికారులు, నాయకులచే ఎదుర్కొన్న ఇబ్బందులను వైసిపి నాయకులు, కార్యకర్తలు డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. నరసరావుపేట పట్టణ సమీపంలో లింగంగుంట్ల వైసిపి జిల్లా కార్యాలయంలో శనివారం డిజిటల్ బుక్ యాప్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశం మాట్లాడుతూ ఇటీవల జగన్మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ యాప్‌ను వైసిపి కేంద్ర కార్యాలయంలో లాంచ్ చేశా రన్నారు. కూటమి నాయకుల వేధింపులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వైసిపి, నాయకులు కార్యకర్తలు సమస్యను స్మార్ట్ ఫోన్ ద్వారా డిజిటల్ బుక్ యాప్‌లో ఫొటోతో సహా తమకు జరిగిన అన్యాయం నమోదు చేయాలన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని సైకో అనడం తగదన్నారు. రెడ్ బుక్ ధీటుగా వైసిపి డిజిటల్ బుక్ యాప్ నిలిచి క్యాడర్‌కు పూర్తి భరోసా ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసిపి వర్గీయులను ఇబ్బందులకు గురి చేసిన టిడిపి కూటమి నాయకులను, అధికారులను వదిలిపెట్టే ప్రశక్తి లేదని అధికారంలోకి రాగానే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే నంబూరి శంకరరావు, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి మాట్లా డుతూ రెడ్‌బుక్ పై ఉన్న శ్రద్ధ రాష్ట్రాభివద్ధి, ప్రజా సంక్షేమంలో చూపడంలేని ఆరోపించారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న వైసిపి నాయకులను హౌస్ అరెస్టు చేసి, ఎమర్జెన్సీని తలపించేలా ఆంక్షలు విధిస్తున్నారని అక్రమాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

బిల్లుల చెల్లింపునకు నేడూ అవకాశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నేడు సెలవు దినం అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయాలు ప్రత్యేకంగా తెరవబడి, వినియోగదారుల కోసం బిల్లుల చెల్లింపు కౌంటర్లు పనిచేస్తాయని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ బి.వెంకటేశ్వరరావు ప్రకటించారు. నరసరావుపేటలోని తన కార్యాలయంలో ఆయన మాట్లా డుతూ జిల్లాలోని ఇళ్ళు, వ్యాపారాలు, వ్యవసాయం, ఇతర కేటగిరీలకు చెందిన వినియోగదారులు తమ పాత బకాయి లు ప్రస్తుత నెలబిల్లులను చెల్లించుకోవాలని విద్యుత్ శాఖ విజ్ఞప్తి చేస్తుందన్నారు. పట్టణాలకే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా విద్యుత్ సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి బిల్లుల వసూళ్లు చేపడతారన్నారు. బకాయిలను నిర్లక్ష్యం చేసే వినియోగదారులపై కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని సంబంధిత విద్యుత్ కనెక్షన్లు తొలగించాలన్నారు. వినియోగదారులు సమయానికి బిల్లులు చెల్లించడం ద్వారా విద్యుత్ శాఖకు ఆర్థిక వనరులు సక్రమంగా లభిస్తాయన్నారు.

మెగా జాబ్‌మేళాలో 71 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల పట్టణంలోని శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళా జరిగింది. ఈ జాబ్ మేళాకు 10 కంపెనీలు హాజరు కాగా, 178 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అందులో 71 మంది ఉద్యోగాలకు ఏంపికయ్యారు. ముఖ్య అతిధిగా హాజరైన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జె.లక్ష్మి కుమారి మాట్లాడుతూ ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ వారు ఈ జాబ్ మేళ నిర్వహించడం సంతోషకరమని తెలియజేశారు, నియామక పత్రాలు అందుకున్న యువతకు అభినందనలు తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు ఇప్పించడం జరుగుతోందని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ. తమ్మాజిరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగ కల్పనా అధికారి యం. రవీంద్రనాయక్, వీరాంజనేయులు, అంజి రెడ్డి, రామకృష్ణ రెడ్డి, శ్రీకాంత్, కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు, ఎస్.కే.బి.ఆర్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించే వరకూ ఆందోళన

ప్రజాశక్తి - పెదకాకాని

ఇళ్లస్థలాల సమస్య పరిష్కరించే వరకు దశల వారి ఆందోళనలు చేపడతామని సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. స్థానిక సుందరయ్య కాలనీ సిపిఎం కార్యాలయంలో మండల విస్తృత సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి సిపిఎం మండల కమిటీ సభ్యులు కె.ఆదాం అధ్యక్షత వహించారు. పాశం రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం భూముల్లో ఏళ్ల తరబడి ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న సుందరయ్య కాలనీ, స్వర్ణపూరి కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, ఎస్టీ కాలనీ, వడ్డెర కాలనీ, జాన్ హాస్పర్ కాలనీలలో పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థలాలు లేని పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. జిల్లాలో ఎరువులు కొరత వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని యూరియా కొరత లేకుండా రైతులకు అందించాలని అన్నారు. నకిలీ పురుగు మందులు అరికట్టాలని డిమాండ్ చేశారు . ఇటీవల కురిసిన వర్షాలకు మినుం, పత్తి, మిరప దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కౌలు రైతులకి గుర్తింపు కార్డులు, అన్నదాత సుఖీభవ వర్తించేలాగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. గుంటూరు ఛానల్ సీతానగరం నుండి ప్రారంభమై వట్టి చెరుకూరు మండలం వరకు 44 గ్రామాలకు తాగునీరు సాగునీరు అందించే కాలువకట్ల మరమ్మతులు, లాకులు మరమ్మతులు చేయాలని, గుర్రపు డెక్క, తూటి కాడ తొలగించాలని, గుంటూరు ఛానల్ ద్వారా ప్రజలకు తాగటానికి స్వచ్ఛమైన మంచినీరు అందించాలని, ఇప్పటికే మంగళగిరి, గుంటూరు లాంటి చోట్ల ప్రజలు తాగునీరు కలుషితమై అనారోగ్యంతో హాస్పిటల్స్‌లో చేరారని తెలిపారు. ఇప్పటికైనా జిల్లాలో స్వచ్ఛమైన మంచినీరు అందించాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ మండలంలో వివిధ పంచాయతీలలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని స్వచ్ఛమైన ఫిల్టర్ చేసిన తాగునీరు అందించాలని కోరారు. సిపిఎం నంబూరు గ్రామ శాఖా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ నంబూరు గ్రామములో ఊరికి నాలుగు పక్కల రహదారులకు సప్టాలు ఉన్నచోట హైలెవెల్ బ్రిడ్జిలు నిర్మించాలని, వరద నీరు గ్రామంలోకి రాకుండా మురుగునీరు పోయే మార్గాల కల్వర్టులు బాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.రాజారమేష్, బి.సాంబయ్య, ఎస్.నీలాంబరం, కె. సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాశం రామారావు

గుర్రం జాషువా సాహిత్యాన్ని విస్తృతం చేయాలి

నవయుగ కవితా చక్రవర్తి,విశ్వ నరుడు గుర్రం జాషువా సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు కోరారు. జాషువా 130వ జయంతిని పురస్కరించుకొని స్థానిక సుందరయ్య కాలనీలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ జాషువా తన జీవితాంతం సమాజ అభ్యున్నతి కోసం, మూఢనమ్మకాలు, కుల వివక్షత, అంటరాని తనం, మహిళలపై అత్యాచారానికి వ్యతిరేకంగా తన కలాన్ని, గళాన్ని ఎక్కుపెట్టారన్నారు, సిఐటియు జిల్లా కార్యదర్శి శివాజీ మాట్లాడుతూ జాషువా సాహిత్యం ప్రజలపై చెరగని ముద్ర వేసిందని ప్రజల్లో చైతన్యాన్ని పురికొల్పిం దని, జాషువా సాహిత్యాన్ని ప్రభుత్వం విస్తృతంగా పాఠ్యపుస్తకాల్లో ప్రచురితం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాషువా సంఘ నాయకులు ఎం.శ్రీనివాసరావు, వీరరాఘవయ్య, సాంబయ్య,రాజా రమేష్, సత్యనారాయణ, నీలాంబరం తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో కలసి ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

సేంద్రీయ పంటలనే వినియోగించండి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

సేంద్రీయ ఎరువులతో పండిన కూరగాయలనే వినియోగించాలని గొట్టిపాడు పి.హెచ్.సి డాక్టర్ మేరీ యూనిస్ అన్నారు. శనివారం ప్రత్తిపాడు మండలం లోని కోయవారి పాలెం, యనమదల గ్రామాలలో స్వస్తి నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో కలిసి ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు కో లోకేటెడ్ పిహెచ్‌సి డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సంప్రదాయ వంటకాలతో పప్పు ధాన్యాలు, ఆకు కూరలు, పండ్లు ప్రతిరోజూ తీసుకోవడం వలన గర్భవతులు, బాలింతలు, పిల్లల్లో రక్త హీనత నివారించవచ్చు అన్నారు. వీటిని తీసుకోవడం వలన అనారోగ్యానికి గురి కాకుండా ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యనమదల పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్ ఎస్.భారతి, సి.హెచ్.ఓ. చెల్లెమ్మ, ఎఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపులపై ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాశక్తి - తెనాలిరూరల్

విద్యుత్ బిల్లులు చెల్లింపులకు ఆదివారం అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు తెరిచి ఉంటాయని ఎపిసిపిడిసిఎల్ ఆపరేషన్ డివిజన్ తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వి.చిరంజీవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల సౌకర్యార్థం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ బిల్లులు చెల్లించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ఆన్‌లైన్ విధానంలో, ఎపిసిపిడిసిఎల్ యాప్ ద్వారా, ఫోన్/గూగుల్ పే ద్వారా సులభంగా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని వినియోగదారులను కోరారు.

మంగళగిరి డీఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ

డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక డిఎస్‌పి కార్యాలయాన్ని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్‌పి మాట్లాడుతూ కేసుల సత్వర దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. మహిళలు, చిన్నారులు, బలహీన వర్గాలపై జరిగిన నేరాలపై నమోదైన కేసులను ప్రాధాన్యతగా దర్యాప్తు చేయాలని కోరారు. బాధితులకు త్వరితగతిన న్యాయమందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వీవీఐపీ, వీఐపీల రాకపోకలు జరిగే మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ, చెక్ పోస్టులు, పెట్రోలింగ్ వంటివి కట్టుదిట్టంగా నిర్వహించేలా చూస్తూ ఎటువంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్త్ డిఎస్పీ ఎ.మురళీ కృష్ణ, ఎస్‌బి సీఐ అళహరి శ్రీనివాస్, మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు, రూరల్ ఎస్ఐ సిహెచ్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం నాయకునికి నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం నిడమర్రు సిపిఎం నాయకులు, గతంలో గ్రామ ఉపసర్పంచిగా పనిచేసిన కట్టెపోగు నానయ్య (72) అనారోగ్యంతో మృతి చెందారు . శనివారం ఆయన భౌతికకాయంపై పూలమాలలు వేసి పలువురు నివాళులు అర్పించారు . ఈ కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి డివిజన్ నాయకులు గైరుబోయిన నాగేశ్వరరావు, కట్టెపోగు ప్రకాశరావు, ఎం.రాజముని, ఎం.అంకమ్మరావు, ఎం.కోటేశ్వరరావు, ఎం .భాగ్యరాజు, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి

ప్రజాశక్తి - పెదనందిపాడు

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా శనివారం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ జాషువా ఉమ్మడి గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారని, కుల వివక్ష, సామాజిక అసమానతల కు వ్యతిరేకంగా తన రచనల ద్వారా ప్రజలలో చైతన్యాన్ని కల్పించారని చెప్పారు. వారు రచించిన గబ్బిలం, ఫిరదౌసి, క్రీస్తు చరిత్ర వంటి రచనలు ప్రసిద్ధి చెందాయి అన్నారు. 1964లో శాసన మండలి సభ్యులుగా పని చేశారని, కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో గౌరవించింది అని తెలిపారు. అసమానతలు లేని సమాజం కోసం వారు చేసిన కృషి కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముందుగా జాషువా చిత్రపటానికి విజ్ఞాన కేంద్రం నాయకులు జంపని రామారావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కో కన్వీనర్ కొత్త వెంకటశివరావు, సభ్యులు ముద్దన వెంకటేశ్వర్లు, కాపు వెంకట సుబ్బారావు, పి.భువనేశ్వరి, మర్రి లక్ష్మి, షేక్ షమీ, బాలబాలికలు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న విజ్ఞాన కేంద్రం సభ్యులు

ఆర్‌వోబి పనులను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్.ఓ.బి) పనులను జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా శనివారం పరిశీలించారు. జి.జి.హెచ్ వద్ద నుండి బ్రాడిపేట - అరండల్ పేట వరకు జరుగుతున్న పనులను తనిఖీ చేశారు.ఆర్.ఓ.బి పనుల వలన ట్రాఫిక్‌లో ఇబ్బందులు ఎదురవుతుందని దృష్టికి రావడంతో పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి కావడానికి అవసరమైన చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్.ఓ.బి పనులు రూ.98 కోట్లతో 930 మీటర్లు పొడవున నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. పనులు సకాలంలో పూర్తి చేయటానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ట్రాఫిక్ అంతరాయం త్వరితగతిన పరిష్కారం కావడానికి దోహదం అవుతుందని చెప్పారు. రహదారులు, భవనాల శాఖ కార్యనిర్వహక ఇంజనీర్ సి.విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ బ్రాడీపేట వద్ద కొంత స్థలం క్లియర్ కావలసి ఉందని, అది పూర్తి అయితే నిర్మాణానికి ఎటువంటి ఆటంకం లేదని వివరించారు. కార్యక్రమంలో రహదారులు, భవనాల శాఖ డి.ఇ డి.చిన్నయ్య, ఏ.ఇ వి. సాయికృష్ణ, లక్ష్మీ ఇన్‌ఫ్రా డెవలపర్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఓబి పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గిరిజన భవన్‌ను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - గుంటూరు

అడవి తక్కెళ్లపాడులోని గిరిజన భవన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలు గిరిజన సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాను కోరారు. ఈ మేరకు సంఘాల నాయకులు శనివారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిజన భవన్‌ను జిల్లా గిరిజన భవన్ సంక్షేమ కమిటీకి ఇచ్చి అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. గిరిజనుల కోసం గుంటూరు జిల్లాలో కేటాయించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో రిజర్వేషన్ పాటించకుండా ఇబ్బందికి గురి చేస్తున్నారని తెలిపారు. జనాభా ప్రాతిపదికన రావాల్సిన కార్పొరేటర్, కౌన్సిలర్, వార్డు మెంబర్లు కూడా రిజర్వేషన్ ప్రకారం ఇవ్వట్లేదన్నారు. తెనాలి, గుంటూరులో గిరిజన కమ్యూనిటీ హాల్స్‌ను కొందరు స్వార్థపరులు వ్యక్తిత ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని, వాటిపై విచారణ చేయించాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో కె.సంజయ్, డి.శంకరరావు, ఎం.శివనాయక్, పి.వెంకటేశ్వర్లు, కె.తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న న్యాయమూర్తి

సబ్‌జైలును సందర్శించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి సత్తెనపల్లి టౌన్

పట్టణంలోని ఉప కారాగారాన్ని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి.విజయ కుమార్ రెడ్డి శనివారం సందర్శించారు. ముందుగా ఆయన సబ్ జైల్లోని పరిసరాలను, ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని అయన పరిశీలించారు. ఎన్ని రోజులుగా జైలులో ఉన్నారు, అందుతున్న సౌకర్యాలను గురించి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికైన బెయిల్ వచ్చి సంబంధిత పత్రాలు సమర్పించ లేని పరిస్థితులు ఏమైనా ఉన్నాయా అనే విషయాలపై ఆయన ఆరా తీశారు. ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ప్రభుత్వం ఉచిత న్యాయ సహాయం అందించేందుకు న్యాయవాదిని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ప్యానల్ న్యాయవాది బి.ఎల్. కోటేశ్వరరావు, సబ్ జైల్ సూపరింటెండెంటు వెంకటరత్నం, సిబ్బంది ఉన్నారు.

పోస్టరు ఆవిష్కరిస్తున్న అధికారులు, సచివాలయ సిబ్బంది

అందరికీ జిఎస్‌టి ఫలాలు

ప్రజాశక్తి - నాదెండ్ల

కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన జిఎస్‌టి 2.0 ప్రయోజనాలు ప్రజలందరికీ అందాలని చికలూరిపేట జిఎస్‌టి డిప్యూటీ అకౌంటెంట్ నోము సుజాత అన్నారు, శనివారం మండల కేంద్రమైన నాదెండ్లలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి టి. వెంకటేశ్వర్లు మాట్లా డుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెప్టెంబర్ 22 నుండి ప్రవేశ పెట్టిన జిఎస్‌టి 2.0 ప్రతిఫలాలు ప్రజలందరికీ అందాలనే ఉద్దేశ్యంతో వ్యాపారస్తులతో పాటు ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మైనారిటీల అభ్యున్నతే లక్ష్యం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ముస్లిం మైనారిటీ వర్గాల అభ్యున్నతి కోసం శ్రమిస్తూ, వారికి రాజకీయ గుర్తింపును నియోజకవర్గ వ్యాప్తంగా తెచ్చిన శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అని తెలుగు దేశం పార్టీ ముస్లిం మైనారిటీ నేతలు అన్నారు. శనివారం స్థానిక పందరిపురంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జాన్‌సైదా అనే కాంట్రాక్టర్ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక సంఘాలకు సరఫరా చేసిన వస్తువులకు సంబంధించిన కాంట్రాక్ట్‌లో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారనీ, దానిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావును విమర్శించే ముందు పట్టణంలో ట్రాన్స్‌పోర్ట్, మెకానికల్, ఆటో మొబైల్స్, ఓల్డ్‌బారన్, రియల్ ఎస్టే ట్, ఫ్రూట్స్, గ్రావెల్ సరఫరా వంటి రంగాలలో ముస్లింమైనారిటీ వర్గాలకు చెం దిన పలువురు ఉన్నత స్థానాలలో ఉన్న సంగతి గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. ఇందుకు ప్రతిష్టాత్మక పదవులు నిర్వ హిస్తున్న మేమే ఉదాహరణ అని షేక్ కరీముల్లా, షేక్ రఫానీ, పఠాన్ సమద్ ఖాన్ తెలియజేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలను ప్రైవేటీకరించొద్దని వినతి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రంలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి లీగల్ సెల్ జిల్లా న్యాయవాదులు శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కృతికశుక్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలని ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. లీగల్ సెల్ జిల్లా అధ్యక్షురాలు రొడ్ల మాధవి, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల వైసిపి లీగల్ సెల్ అధ్యక్ష కార్యదర్శులు న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణంలోని నెహ్రూ నగర్లో జిల్లా పరిషత్ సోషల్ వెల్ఫేర్ విభాగం ద్వారా గతంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన స్థలం అన్యాక్రాంతమైందని నరసరావు పేటలో ప్రత్యేకంగా ప్రతి శనివారం జరిగే ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ సమావేశంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు అడపామోహన్ మాదిగ తెలిపారు. స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్లోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ అర్జీని పరిశీలించి సమస్య పై చర్యలు తీసుకోవాలని చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్‌కి ఎండార్స్ చేశారన్నారు. స్థానికంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజల భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వటమే కాకుండా ఆమె తక్షణమే స్పందించడంపై హర్షం వ్య క్తం చేశారు.

గుర్తింపు కార్డులు అందజేస్తున్న కమిషనర్, తదితరులు

కళ్యాణ రుణ మేళా

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వీధి విక్రయదారులకు ప్రధానమంత్రి ఆత్మ నిర్భయ, మెప్మాఆంధ్ర ప్రదేశ్ వారి ఆధ్వర్యంలో కళ్యాణ రుణమేళాను శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా చిలకలూరిపేట వీధి విక్రయ దారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మారుబోయిన శ్రీనివాసరావు, కమిషనర్ పి.హరిబాబు, చైర్మన్ రఫాని పాల్గొని మాట్లాడారు. అర్హుల కన్నా అనర్హులను ఎక్కువగా ఎంపిక చేయడంతో అనర్హులు కార్డులు తీసుకుంటున్నారని శ్రీనివాసరావు అన్నారు. ఇప్పటికైనా అర్హులను గుర్తించాలన్నారు. రుణమేళాలో చిరు వ్యాపారులకు వివిధ విక్రయ దారులకు స్వానిధి ద్వారా రూ.15నుంచి 50వేల వరకు రుణం మంజూరు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు అధికారులు, ఆర్పీలు, అన్ని బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు. అనంతరం వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు వీధివిక్రయ దారులు పాల్గొన్నారు.

నేడు అనుగురాజు విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పల్నాడు చరిత్రను భావితరాలకు తెలియజేయడం మన అందరి బాధ్యత అని టిటిడి బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి అన్నారు.శనివారం పట్టణంలోని గంగమ్మ గుడి దేవాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నేడు పల్నాడు చరిత్రకారులు,అఖండ పల్నాడును ఏలిన అనుగు రాజు విగ్రహ ఆవిష్కరణ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావ, నర్సరావుపేట ఎంపి లావు, స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాజరవుతారని అన్నారు. అనుగురాజు పరిపాలనలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. కులాలకు, మతాలకు అతీతంగా చాపుకూడు సిద్ధాంతం ఏర్పాటు చేశారని అన్నారు. విగ్రహావిష్కరణలో పల్నాడు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న జంగా కృష్ణమూర్తి, తదితరులు

పత్తి, మిరప పొలాల్లో సందర్శన

ప్రజాశక్తి - యడ్లపాడు

ఎడ్లపాడు గ్రామంలో మండల వ్యవసాయాధికారి హరి ప్రసాద్ ఉద్యాన శాఖాధికారి శ్రీలక్ష్మి శనివారం పత్తి, మిరప పొలాలను సందర్శించారు. ముందుగా మిరప చేలో తీసుకోవలసిన చర్యలు గురించి ఉద్యాన శాఖ అధికారి వివరించారు. చేలలో వర్షపు నీరు నిలబడకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. వర్షాలు ఆగిన వెంటనే అంతర కషి చేసి కలుపు తొలగించడమే కాకుండా నెల ఆరే విధంగా చేసుకోవాలి. ఇపధాతులోపం ఉంటే 10 లీటర్ల నీటికి 50 గ్రాముల అన్నభేదితోపాటు 10 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పిచికారి చేసుకోవాలి. వేరుకుళ్ళు ఎక్కడైనా గమనించినట్లయితే మొక్కలు చనిపోకుండా ఉండటానికి కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటర్ నీటికి మూడు గ్రాములు చొప్పున కలిపి వేర్లు తడిచే విధంగా నీళ్లు పోసుకోవాలి. అనంతరం పత్తి పొలాన్ని సందర్శించారు. పొలంలో నీరు నిలపడకుండా చూసుకున్నట్టుతో పాటు ఎక్కడైనా నీరు నిలబడినట్లు లేదా అధిక తేమ ఉన్నచో మొక్కలు చనిపోకుండా ఉండటానికి పై పాటుగా 19.19.19. ఎకరాకి కిలో చొప్పున గూడ, పిందె రాలిపోకుండా ఉండటానికి సూక్ష్మ ధాతువుల నివారణకు ఫార్ములా 4 (మ్యాక్స్) ఎకరాకి 400 గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎన్.అనుపమ, రైతు జొన్నలగడ్డ శివఆంజనేయులు పాల్గొన్నారు.

దసరా కానుకగా డిఏను ప్రకటించండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు ఉపాధ్యాయులకు దసరా పండుగ కానుకగా కరువు భత్యం(డిఏ) ప్రకటించాలని ఎస్టియు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే కోటేశ్వరరావు, రాష్ట్ర డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు సంయుక్తంగా కోరారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2024 జనవరి నుండి నాలుగు డిఏలు ప్రకటించాల్సి ఉందనీ, రెండు డిఏలైనా ప్రకటించాలని కోరారు. గత ప్రభుత్వం పిఆర్సి బకాయిలు, డిఏ బకాయిలు పెండింగ్లో ఉంచిందని ఆ బకాయిలు విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం కషి చేయా లని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కోరుతుందని తెలిపారు. మెగా డీఎస్సీ 20 25 ఉపాధ్యాయుల నియామకానికి ముందే క్లస్టర్ ఉపాధ్యా యుల సర్దుబాటు చేయాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఉపాధ్యా యులందరూ టెట్ పాస్ కావాలనే నిబంధన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూడాలన్నా రు. చిలకలూరిపేట ఏరియా కార్యదర్శి వినుకొండ అక్కయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు వడ్లాన జయప్రకాష్. నాదెండ్ల మండల అధ్యక్షులు షేక్ మక్బూల్ బాషా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ చిలకలూరిపేట మండల అధ్యక్షులు బొంత రవి షేక్ మస్తాన్ వలి వి రమణా నాయక్ ఎడ్లపాడు మండల అధ్యక్షులు జి కోటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ ఎస్ టి యు సీనియర్ నాయకులు చావల మల్లేశ్వరరావు ప్రముఖ్యులు పాల్గొన్నారు.

యడ్లపాడులో ఆరోగ్య శిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న తిమ్మాపురం ఆరోగ్య సచివాలయం, జడ్‌పిహెచ్ స్కూల్‌లో ఎస్ఎన్ఎస్‌పిఏ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ పద్మావతి పల్నాడు జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖాధికారి సందర్శించి కార్యక్రమం జరుగుతున్న విధము, రికార్డులను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి సకాలంలో వైద్యం అందుతుందా లేదా అని తెలుసుకున్నారు. ఆరోగ్య పరీక్షల అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రబీ సీజన్లో చిరుధాన్యాల పంటలను సాగు చేయాలని సత్తెనపల్లి మండల తహశీల్దార్ కె.యస్.చక్రవర్తి రైతులకు సూచించారు. సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు గ్రామంలో రబీ పంటల సాగుపై శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు తహశీల్దార్ మాట్లా డుతూ బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేయవద్దని, వందశాతం బ్లాక్ బర్లీ పొగాకు సాగు నిషేదంపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి బి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ 2025-26 రబీ నుండి రాష్ట్రంలో బ్లాక్ బర్లీ పొగాకు సాగును నిషేధించేందుకు జిల్లా, డివిజనల్ మండల స్థాయిలలో టాస్కఫోర్స్ కమిటీల ఏర్పాటు చేసిందని తెలిపారు. బ్లాక్‌బర్లి పొగాకు నారు సాగు చేసే రైతులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైట్‌బర్లి పొగాకును సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఆయా సంస్థల నుండి అగ్రిమెంట్ బాండ్లను పొందాలని వివరించారు, రబి సీజన్లో ప్రత్యామ్నాయ పంటలుగా మొక్కజొన్న, పెసర మినుము లేదా చిరుధాన్యాలు (కొర్ర, సజ్జలు, జొన్నలు) సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జె నాగయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి

ప్రజలకు కావాల్సింది సుపరిపాలన

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

ప్రజలకు కావాల్సింది సుపరిపాలన అని రెడ్ బుక్ రాజ్యాంగం కాదని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలన, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వ పాలన ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. ప్రజలకు కావాల్సింది ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలు కాదు. గ్రామాలలో అభివృద్ధి, శాంతి భద్రతలు సక్రమంగా అమలు చేసే ప్రభుత్వం కావాలన్నారు. 11 ఏళ్లుగా రాష్ట్రంలో సాగుతున్న అరాచక- అబద్ధాల ప్రభుత్వాలను ప్రజలు అసహనంతో చూస్తున్నారని, తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు కొమ్ము కోటేశ్వరరావు, వంగపాటి నాగరాజు, రాజారావు మాస్టారు, దొడ్డ శ్రీనివాసరావు, నాజర్ వలీ పాల్గొన్నారు.

ముప్పాళ్లలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ప్రజాశక్తి-ఈపూరు

విద్యుత్ స్తంభాల ఏర్పాటును ప్రారంభిస్తున్న జగ్గారావు

ఎ.ముప్పాళ్ల గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న విద్యుత్ స్తంభాల సమస్య ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చొరవతో పరిష్కారమైందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు అన్నారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన పాత విద్యుత్ స్తంభాల స్థానంలో 26 కొత్త విద్యుత్ స్తంభాలు మంజూరు కాగా ఏడిఈ బి.వెంకటేశ్వర రెడ్డి పర్యవేక్షణలో ఏఈ ఎస్.గాంధీ బాబు ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను శనివారం ప్రారంభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మంత్రి సవితకు వినతిపత్రం అందజేసిన కేసన

బీసీ స్టడీ సర్కిళ్ల ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి : కేసన

ప్రజాశక్తి - మంగళగిరి

బలహీన వర్గాలకు చెందిన బీసీ నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ నిచ్చి, ఉద్యోగార్థులను చేసే ఉద్దేశంతో, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 13 బీసీ స్టడీ సర్కిళ్ల లో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం బీసీ స్టడీ సర్కిళ్ల ఉద్యోగ సంఘ రాష్ట్ర అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావుతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితకు విజ్ఞాపన పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వై.రామకృష్ణ, రాష్ట్ర నాయకులు సూరిబాబు, పి.పురుషోత్తం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న పిహెచ్‌సి సిబ్బంది

డయేరియా, జ్వరాలపై అవగాహన

ప్రజాశక్తి - ఫిరంగిపురం

నుదురుపాడు పిహెచ్‌సి పరిధిలోని మేరికపూడి గ్రామంలో డయేరియా, జ్వరాల నివారణపై గురువారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కంజుల పద్మావతి బ్రహ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలు తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, తాజా ఆహార పదార్థాలను మాత్రమే తీసుకుని, బయటి తినుబండారాలకు దూరంగా ఉండాలని వైద్య, ఆరోగ్య సిబ్బంది పిలుపునిచ్చారు. ర్యాలీలో కార్యదర్శి కె.విష్ణు, సీహెచ్‌ఓ ఎన్.వెంకటలక్ష్మి, హెచ్‌ఎస్ కె.సుదర్శన్ రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.చిన్నమ్మాయి, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

ఆంజనేయులు కృషి మరువలేనిది

ప్రజాశక్తి-గుంటూరు

బడుగు బలహీన వర్గాల కోసం తన్నీరు ఆంజనేయులు కృషి మరువలేనిది బీసీ సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తన్నీరు ఆంజనేయులు సంస్మరణ సభ శనివారం చుట్టుగుంటలోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ అధ్యక్షత వహించారు. జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర రావు, వడ్డెర కార్పొరేషన్మ ఛైర్మన్ మల్లె ఈశ్వరరావు, కన్నా మాస్టర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమలేశ్వర రావు, సంఘం కార్యకర్తలు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు.

దసరా ఉత్సవాల్లో మంత్రి చంద్రశేఖర్

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలపై రోజురోజుకూ పెరుగుతున్న దాడులు

జిల్లా ప్రొహిబిషన్ అధికారి వాసంతి బొడ్లపాటి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులు, లైంగిక వేధింపులు రోజురోజుకు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరు భాధ్యత వహించాలని గుంటూరు జిల్లా ప్రొహిబిషన్ అధికారిణి, జిల్లా బాలల సంరక్షణ ఇన్‌చార్జి వాసంతి బొడ్లపాటి అన్నారు. స్థానిక కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్, కెఎల్ న్యాయ కళాశాలల సంయుక్త అధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పరిస్థితిని అరికట్టేందుకు సమాజం మొత్తానికి అవగాహన అవసరమన్నారు. చట్టాలు ఉన్నప్పటికీ, వాటి అమలు పటిష్టంగా జరగకపోవడం, బాధితులు భయంతో ముందుకు రాకపోవడం వల్ల నేరస్తులు మరింత ధైర్యంగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగ, పని ప్రాంతాలలో ఆయా స్థాయిలలో లైంగిక వేధింపులపై స్పష్టమైన చర్చలు జరగాలన్నారు. విద్యార్థులకు చిన్న వయసు నుంచే లింగ సమానత్వం, మహిళల గౌరవం గురించి బోధించడం ద్వారా సమాజ దృక్పథం మారుతుందన్నారు. పోష్ చట్టం, పోక్సో, వరకట్న వేదింపులు వంటి చట్టాల గురించి గురించి ప్రతి మహిళలకు అవగాహన ఉండాలన్నారు. పోలీసులు, న్యాయ వ్యవస్థ మరింత సున్నితంగా స్పందించాలని కోరారు. వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్. ప్రసాద్, ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య అతిథికి జ్ఞాపికను అందజేస్తున్న డాక్టర్ కె.రూత్ రమ్య , మాట్లాడుతున్న వాసంతి

ఆర్‌విఐటిలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - చేబ్రోలు

స్థానిక ఆర్‌విఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలికారు. కళాశాల ప్రిన్సిపల్ ఆర్.వి.కృష్ణయ్య మాట్లాడుతూ కొత్తగా కాలేజీలో చేరిన విద్యార్థులకు ఆనందంగా స్వాగతం పలకడంతోపాటు, కళాశాల ఆహ్లాద వాతావరణం అనుభూతి పొందేలా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. విద్యార్థులు మంచి భవిష్యత్తు కోసం ముందు చూపుతో ఉండాలన్నారు. నూతనంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సమాజంలో వస్తున్న మార్పులకి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందిం చుకుని విజయపథం వైపు నడవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భముగా కళాశాలలో నిర్వహించిన పలు రకాల పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మల్లికార్జున, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకలను ప్రారంభిస్తున్న సిబ్బంది

పద్మశాలిపేటలో స్వస్థనారి సశక్తి పరివార్ అభియాన్

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక పద్మశాలిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వస్థనారి సశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని 16 వవార్డ్ కౌన్సిలర్ దివి అనిత శనివారం ప్రారంభించారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ వేముల ప్రియాంక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ మహిళల్లో గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, సెర్వికల్ క్యాన్సర్ వంటివి రావడానికి అవకాశం ఉంటుందని, మహిళలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ వి.ప్రియాంక మాట్లాడుతూ మహిళలకు అవసరమైన వైద్య సేవలను అందించుటకు ఆయుష్ విభాగ వైద్యులు డాక్టర్ రావూరి మోనిక, గైనకాలజిస్ట్ డాక్టర్ కె.నిసర్గ, డాక్టర్ ఎ.హానోక్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ టి.మధుబాబు, దంత వైద్య నిపుణులు డాక్టర్ సుజిత, కంటి విభాగం నుంచి వినోద్ బాబు అందుబాటులో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సాదా రమేష్, సిడిపిఒ పూడి విజయగౌరీ, డిపిఎంఒ జంగం శ్యామ్, మలేరియా విభాగం నుంచి ఎస్ ఉమాకాంత్, ఎ.బాలచంద్రమౌళి, జి.రవికుమార్, చింతల ప్రసన్న పుష్పలత, దాసరి విజయకుమారి, కంప సరోజినీ, ఎం.అప్పారావు, డి.శ్రీనివాసరావు, డి.శివ నాగమల్లేశ్వర రావు, టి.శివరామప్రసాద్, పి.రవికుమార్, ఎం.రత్నాకర రావు, సయ్యద్ కరిముల్లా, షేక్ రషీద్, షేక్ బాషీద్, ఎస్ శరత్ బాబు, షేక్ రషీద్, వార్డ్ హెల్త్ సెక్రటరీలు ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నుదురుపాడులో..

ప్రజాశక్తి - ఫిరంగిపురం

నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మేరికపూడి ఆరోగ్య కేంద్రంలో 'స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కంజుల పద్మావతి బ్రహ్మారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రజలకు, ముఖ్యంగా మహిళలు, పిల్లలకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సి.యానిగ్రేస్ స్వయంగా హాజరై రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కె.విష్ణు డి.శివారెడ్డి, సీహెచ్‌ఓ ఎన్. వెంకటలక్ష్మి, ఎంపీహెచ్‌ఎస్ కె.సుదర్శన్ రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. చిన్నమ్మాయి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - తెనాలి

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, హార్వెస్ట్ ఇండియా సంస్థ అధినేత కత్తెర సురేష్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని మాస్ కార్యాలయంలో హార్వెస్ట్ ఇండియా మేనేజర్ సుద్దపల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నిత్యావసరాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్క ఆనందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థను ఎంతో సమర్థవంతంగా నడిపిస్తున్న సురేష్ కుమార్‌ను అభినందించారు. నాగరాజు మాట్లాడుతూ హార్వెస్ట్ ఇండియా సంస్థ చేస్తున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు మరింత విస్తరింపచేస్తామన్నారు. తొలుత సురేష్ కుమార్ పుట్టినరోజు కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. కార్యక్రమంలో డాక్టర్ కె.డేవిడ్ యశ్వంత్ కుమార్, కోట్ల దిలీప్, మహమ్మద్ కుద్దూస్, ఎన్.రమేష్ బాబు, కె.బోసు బాబు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి, నాగరాజు

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

298వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 298 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను కార్మికులు తుపాకుల దుర్గాభవాని, నాగేశ్వరావు ప్రారంభించారు. దీక్షలలో షేక్ ఈమాంభి, ఈ.శారమ్మ, వై.రమాదేవి, వి.రిబ్కా, ఉప్పు కాసమ్మ కూర్చున్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కె.స్టీవెన్, షేక్ సుభాని, బి.సూర్యప్రకాష్, బి.అంకయ్య, వై.సాంబశివరావు, ఎం.ఆశీర్వాదం, ఇస్మాయిల్, డి.నాగేశ్వ రావు, డి.మాణిక్యారావు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌ను సత్కరిస్తున్న వేద పండితులు

శివాలయాన్ని సందర్శించిన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

ప్రజాశక్తి - పెదకాకాని

స్థానిక మల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం సందర్శించారు. దసరా ఉత్సవాలలో భాగంగా స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి అర్చకులు, సిబ్బంది గౌరవ స్వాగతం పలికారు. స్వామివార్ల దర్శనం అనంతరం సుభాష్‌ను గౌరవంగా సత్కరించి తీర్ధ ప్రసాదములు అందజేశారు. అలాగే దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనరు ఎస్.ఎస్.చంద్రశేఖర అజాద్ దంపతులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

చెక్కు అందజేస్తున్న టిడిపి వడ్డేశ్వరం గ్రామ నాయకులు

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

అనారోగ్యం బారిన పడి, విజయవాడ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్న ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన వడ్డేశ్వరం పున్నయ్యకు టిడిపి నాయకులు రెండు లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును విజయవాడ హెల్ప్ హాస్పటల్‌కు వెళ్లి బాధితుడికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు పున్నయ్య మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చెక్ అందజేసిన వారిలో టిడిపి వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, వడ్డేశ్వరం నరసింహారావు ఉన్నారు.

వికలాంగులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక 28వ వార్డు గాంధీనగర్లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బూసి గోవిందరాజు, భూలక్ష్మి మనమరాలు ధన్యత జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం దివ్యాంగులు, అంధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా గ్రేటర్ విజయవాడ పాస్టర్స్ ఫెలోషిప్ కార్యదర్శి రెవరెండ్ బేతపూడి రవికాంత్, ఎస్సీ ఎస్టీ రైట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుమంచి రామారావు హాజరై హాజరయ్యారు.

డ్వాక్రా రుణాలపై నివేదిక సమర్పించండి

అధికారులను ఆదేశించిన పల్నాడు కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలో అందిస్తున్న డ్వాక్రా రుణాలు, చేపడుతున్న జీవనోపాధి కార్యక్రమాలపై నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రణాళికపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. మండలాలు, నెలల వారీగా డ్వాక్రా సంఘాలు కోరిన రుణాలు, బ్యాంకుల వారీగా మంజూరైన రుణాలు, పెండింగ్ లో ఉన్న రుణాలు, రుణాల మంజూరుకు ఎదురవుతున్న సమస్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. డ్వాక్రా మహిళలకు పరిశ్రమలు స్థాపించడం, నిర్వహించడంపై అవగాహన కల్పించేందుకు విజయవంతమైన సంస్థల సందర్శన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళలు వ్యాపారాలు ప్రారంభించేలా ప్రోత్సాహం అందించాలన్నారు. జిల్లాలోని 3000 మహిళా వ్యాపారులు, వారు నిర్వహిస్తున్న సంస్థల డేటాబేస్ నిర్వహించాలన్నారు. ఎడ్లపాడులో మునగ చెట్ల పెంపకం కార్యక్రమంపై నివేదిక సమర్పించాలన్నారు. కార్యక్రమంలో డి.ఆర్.డి.ఏ పిడి ఝాన్సీ రాణి, ఎల్.డి.ఎం రామ్ ప్రసాద్, పరిశ్రమల శాఖ ఏజిఎం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగాయని లెనీనాకు జాషువా పురస్కారం

ప్రజాశక్తి - గుంటూరు

కత్తి లెనీనా

ప్రజాగాయని కత్తి లెనీనా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి ఏటా ఇచ్చే కవికోకిల జాషువా పురస్కారానికి ఎంపికైంది. ఆదివారం విజయవాడలో జాషువా 130వ జయంతి సభలో భాషా సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేశ్, ప్రముఖుల చేతులు మీదుగా ఈ అవార్డును అందజేస్తారు. ప్రజా కళాక్షేత్రంలో తనపాట ద్వారా ప్రజలను నిత్యం చైతన్యం చేస్తున్న కత్తి లెనినాకు ఈఅవార్డు రావడం అభినందనీయమని పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లెనీనా మాట్లాడుతూ ఈఅవార్డు రావడానికి ప్రోత్సాహం అందించిన మాజీ మంత్రి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా సాహితీ సాంస్కృతిక సంస్థలు అభినందనలు తెలిపారు.

ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థినులు

విజ్ఞాన్స్‌లో ఘనంగా దాండియా ఉత్సవాలు

ప్రజాశక్తి - గుంటూరు

వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో దసరా పండుగను పురస్కరించుకుని విద్యార్థులు నవరాత్రి వేడుకలు, దాండియా, బతుకమ్మ, గర్బా, సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య హాజరై మాట్లాడుతూ నలుగురిలో కలవలేకపోతున్నామకునే విద్యార్థులకు నవరాత్రుల్లో చేసే దాండియా, గర్బా నఅత్యాలు కొత్త ఉత్సాహాన్ని అందిస్తాయన్నారు. స్నేహితులు, బంధువులతో కలిసి నఅత్యం చేయడం, సంతోషంగా గడపడం వంటివన్నీ మీలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నఅత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ పి.ఎం.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కష్టాలు, త్యాగాలే నగరానికి ఖ్యాతి

- స్వచ్ఛ లీగ్ అవార్డు సందర్భంగా కార్మికులు, ప్రజారోగ్య కార్యదర్శులకు సన్మానం
- కార్మికులకు ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తేవాలన్న మేయర్ రవీంద్ర

కార్మికులు, కార్యదర్శులను సత్కరిస్తున్న మేయర్, తదితరులు

ప్రజాశక్తి - గుంటూరు

ప్రజారోగ్య కార్మికుల కష్టం, త్యాగాలతోనే జాతీయ స్థాయిలో గుంటూరు నగరం ఖ్యాతిని సాధించిందని, కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. గుంటూరు నగరం సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డు పొందడంలో కీలకమైన ప్రజారోగ్య కార్యదర్శులకు, కార్మికులకు స్వచ్ఛ అచీవర్స్ పేరుతో కమిషనర్ పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సన్మానించారు. మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో నిరంతరం కృషి చేస్తున్న ప్రజారోగ్య కార్మికుల కష్టానికి చేతులెత్తి నమస్కరిస్తున్నామన్నారు. కార్మికులకు ఏ సమస్య ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావలని, అప్కాస్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందడంలేదన్న సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. డ్రెయిన్ శుభ్రం చేసే సందర్భంలో తాగునీటి పైప్ లైన్లలో లీకులు గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని కార్మికులను కోరారు. కమిషనర్ మాట్లాడుతూ నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంలో 6వ ర్యాంక్ సాధించి, దక్షిన భారత దేశంలో ఏకైక నగరంగా గుంటూరు నిలిచిందన్నారు. 3 వేల మంది కార్మికులు, వారి కుంటుంబ సభ్యులకు ఆదివారం మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో యాక్సిస్ బ్యాంక్ అకౌంట్ ద్వారా ప్రమాద బీమా రూ.20 లక్షలు అందుతుందన్నారు. కార్మికులు, కార్యదర్శులకు ఆటల పోటీలు, కార్మికుల నివాస ప్రాంతాల నుండి పని ప్రదేశాలకు రవాణా సౌకర్యం కల్పించడానికి త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్టోబర్ 2 నుండి మెరుగైన పర్యవేక్షణకు సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ అందుబాటులోకి వస్తుందన్నారు. అనంతరం 57 డివిజన్ల నుండి ఒక్కో కార్మికులకు, ఐవిఆర్ఎస్‌లో ఉత్తమ స్థానం సాధించిన శానిటేషన్ కార్యదర్శులను సన్మానించి, జ్ఞాపిక అందించారు. తొలుత నాట్య గురువు ఖలీల్ నేతృత్వంలో శాస్త్రీయ నృత్యం, ప్రజా గాయకులు రమణ నేతృత్వంలో జానపద నృత్యాలు, గీతాలు అలరించాయి. ఏపి హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాష, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్. శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఎంహెచ్ఓ (ఇన్‌చార్జి) రామారావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వైద్యశిబిరం వద్ద స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్, నియామక పత్రాన్ని అందిస్తున్న కలెక్టర్

వైద్య శిబిరాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ అన్సారియా

ప్రజాశక్తి - గుంటూరు

పాత గుంటూరు యాదవ బజార్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం తనిఖీ చేశారు. ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో వ్యాధుల ప్రభలే అవకాశం నేపథ్యంలో ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనారోగ్యం వస్తే వెంటనే దగ్గర్లోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలన్నారు. ఆర్వో నీటిని గాని, మున్సిపల్ నీటిని గాని కాచి చల్లార్చి తాగాలని, ఇంట్లో వండిన వేడి ఆహార పదార్థాలనే తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

మహిళకు ఉపాధి కల్పన

అంధత్వంతో బాధపడుతూ కుమారుని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్న జ్యోతికి గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో పారిశుధ్య విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాన్ని ఇస్తూ జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం నియామక పత్రాన్ని తన కార్యాలయంలో అందించారు. దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు డి.దుర్గాభాయి మాట్లాడుతూ జ్యోతి ఎనిమిదేళ్ల కుమారుడు కొద్ది రోజుల క్రితం నిమోనియా వ్యాధికి గురికాగా జిల్లా కలెక్టర్ స్పందించి జిజిహెచ్‌లో మెరుగైన చికిత్స అందేటట్లు చేశారన్నారు. కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎడ్‌సెట్ - 2025 తుది విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సౌజన్యంతో 2025-26 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రంలోని బీ.ఎడ్ కళాశాలల్లో ప్రవేశాల కొరకు నిర్వహించే ఏపీఎడ్‌సెట్ - 2025 తుది విడత కన్వీనర్ కోటా వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ఏపీఎడ్‌సెట్ కన్వీనర్, ప్రొ. ఏ.వి.వి.ఎస్. స్వామి తెలియజేశారు. ఏపీఎడ్‌సెట్-2025 పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ తుది విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి అర్హులు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, సర్టిఫికెట్లను వెరిఫికేషన్ కోసం అప్‌లోడ్ చేయవలసి ఉంటుంది. అనంతరం వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవచ్చు. ఈనెల 29వ తేదీ నుండి అక్టోబర్ మూడో తేదీలోగా రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు ప్రక్రియ ఉంటుందన్నారు. వెరిఫికేషన్ 30 తేదీ నుండి అక్టోబర్ 4వ తేదీ వరకు, వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ అక్టోబర్ 5వ తేదీ నుండి ఏడవ తేదీ వరకు,అక్టోబర్ 8వ తేదీన వెబ్ ఆప్షన్ల మార్పు, పదవ తేదీన సీట్ల కేటాయింపు ప్రక్రియ ఉంటుందన్నార

దుకాణదారునితో మాట్లాడున్న మంత్రి పెమ్మసాని

జిఎస్‌టిపై అవగాహన సదస్సులు

ప్రజాశక్తి - గుంటూరు

జిల్లాలో శనివారం జిఎస్‌టిపై అవగాహన సదస్సులు నిర్వహించారు. జిఎస్‌టి ఛాంపియన్ అధికారులు, జిఎస్టి శాఖ అధికారులు వివిధ ప్రాంతాల్లో, మండలాల్లో విస్తృత కార్యక్రమాలు నిర్వహించి, జిఎస్‌టి తగ్గింపు వలన వివిధ ధరలు ఏ మేరకు తగ్గాయో వివరించారు. కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, పాత గుంటూరులో యాదవ బజార్ శ్రీకృష్ణ కళ్యాణ మండపంలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. అక్కడి దుకాణాల వద్దకు నేరుగా వెళ్ళి జిఎస్టి తగ్గింపు వలన వస్తువుల ధరలు, ప్రజలకు కలిగే అడిగి తెలుసుకున్నారు. ఆరండల్ పేట, మంగళదాసు నగర్, కొత్తపేట, నవోదయ కాలనీ, రాజరాజేశ్వరి నగర్, కురగల్లు, ఆత్మకూరు, బేతపూడి, కొలనుకొండ, వడ్డేశ్వరం, ఇప్పటం, చిర్రావూరు తదితర ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. జిఎస్టి తగ్గింపు వలన వస్తువుల ధరలు తగ్గిన అంశంపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్.సజీల, జిఎస్టి జాయింట్ కమిషనర్ గీతా మాధురి, జిఎంసి అదనపు కమిషనర్ ఓబులేసు అధికారులు పాల్గన్నారు.

ధరల తగ్గింపుపై కమిషనర్ పరిశీలన

పాతగుంటూరులోని పలు దుకాణాలను కమిషనర్ పి.శ్రీనివాసులు శనివారం సందర్శించారు. జిఎస్టీ తగ్గింపుపై వివరాలు అడిగి, ప్రజలకు తగ్గింపుతోనే వస్తువులు విక్రయించాలని సూచించారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు తమ వద్ద అమ్మే వస్తువులపై తగ్గిన జిఎస్టీ రేట్లను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించని షాపులపై చర్యలు తీసుకుంటామన్నారు.

కిమ్స్ శిఖర ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్‌డే వాక్‌థాన్

ప్రజాశక్తి - గుంటూరు

కిమ్స్ శిఖర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో "వరల్డ్ హార్ట్ డే వాకథాన్" శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసిద్ధ నటి శివానీ నగారం పాల్గొన్నారు. హాస్పిటల్ మేనేజ్మెంట్, సిబ్బందితో కలిసి సమాజంలో హృదయ ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు వాకథాన్‌ను ప్రారంభించినట్లు డాక్టర్ నాగశ్రీ హరిత, కిమ్స్ శిఖర హాస్పిటల్స్, కార్డియాక్ సైనెన్స్ డైరెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన జీవనశైలిలో గుండె వ్యాధులు కేవలం వృద్ధులకు మాత్రమే కాకుండా యువతలో కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. శారీరక శ్రమ, అసమతుల్య ఆహారం, మానసిక ఒత్తిడి యువతలో గుండె సమస్యలకు కారణమవుతున్నాయి. చిన్న చిన్న స్కానింగ్లు, పరీక్షలతో ముందుగానే ప్రమాద సూచికలను గుర్తించవచ్చని తెలిపారు. కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం, ఉప్పు, చక్కెర తక్కువ తీసుకుంటూ, కొవ్వును తగ్గించుకోవడం, ప్రతి రోజు వ్యాయామం, స్మోకింగ్, మద్యపానాన్ని పరిమితం చేయడం, యోగా, ధ్యానం చేయడం వల్ల గుండెపై ఒత్తిడిని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.శివప్రసాద్ మాట్లాడుతూ హృదయ ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం, హెల్త్ చెకప్‌లు చేసుకోవడం వల్ల గుండె జబ్బులను రాకుండా అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ బాబు, కిమ్స్ హాస్పిటల్స్ యూనిట్ హెడ్ డాక్టర్ హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాక్‌థాన్‌లో పాల్గొన్న నటి శివానీ నగారం